# బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్!

**-యలమర్తి అనూరాధ**

**భో**రున కురుస్తోంది వర్షం. మేఘాలకెంత బాధ వేసిందో ఇన్ని కన్నీళ్ళు కారుస్తున్నాయి? తన ఇంటి దీపం ఆరిపోయి జీవితం అమావాస్య చీకటిలా భయపెట్టి కన్నీళ్ళు పెట్టిస్తుంటే, అందరివీ కన్నీళ్ళు అనుకుంటే పొరపాటేనేమో? ఏమో! అంతా అయోమయం అనుకొని శుష్క మందహాసం చేసింది 'మధుహాస' చల్లని సాయంత్రం సరదాగా షికారుకి వెళ్ళిన దంపతులలో ఒకరిని సుడిగుండం అక్కున చేర్చుకుంటే ఎంత బాధ? ఇలాంటివన్నీ విని బాధపడేది. కానీ ఇప్పుడు తనే ఆ పరిస్థిలలో.. ఆ బాధ ఇంత బాధని తెలుసుకోలేకపోయాను. 'అనుభవం' అన్నమాట 'ఉన్నమాట' మనసులోనే పిచ్చిగా నవ్వుకుంది. ఇక ఆమెకు మిగిలింది అదే!

ప్రొద్దున లేచిన దగ్గర నుంచీ రాత్రి నిద్రపోయే దాకా కూడా తిరిగే 'చంద్రనీల్', తన చందూ... అన్నింటిలో సగమేమిటి పూర్తిభాగం.. తనతో మాట మాత్రం చెప్పకుండా నీలాకాశం వైపు పరుగుతెల్తాడు. ఆ పరుగు తను అందుకోలేనిది. ఇలాంటి రోజు ఎదుర్కోవలసి వస్తుందని ఊహించలేదే! ఎలా.. ఎలా.. తట్టుకోవటం?

ఎందుకు తట్టుకోలేను? 'చందూ' ఇక లేదని తెలిసి కూడా బండరాయిలా బ్రతికే ఉన్నాను. ఆ విషయం వినగానే ఏ గుండెనొప్పో వచ్చి తను కూడా వెళ్ళిపోతే ఎంత బాగుండేది? చక్కగా 'చందూ'తో నింగిలో కాపురముండేది! అంత అదృష్టం కూడానా? అదే ఉంటే దురదృష్టం ఇలా వెంటాడేదా? అంతా విధి లిఖితం!

చలిచలిగా ఉంది వేడివేడిగా పకోడీలు తిందామని పించి తయారు చేస్తుండగానే షర్టు వేసుకొని 'చందూ' బయలుదేరాడు.

"అదేమిటి? ఇప్పుడు ప్రయాణం! పకోడీలు చల్లారిపోతాయి" అని అడ్డగించాను.

"ఎంతోయ్? నువ్వు వేసేలోపు వచ్చెయ్యనూ" అని వెళ్ళిన మనిషి తిరిగి రాలేదు. బ్రతుకే చల్లారిపోతుందని తెలిస్తే తన చందూనూ బయటికి వెళ్ళనిచ్చేదా? జరగబోయేది తెలిస్తే ఇంకేం? ఇలా ఈ రోజు బాధపడే అవసరమే ఉండదు. 'చందూ' ఇకలేడు.. రాడు అంటే పిచ్చి మనసు ఒప్పుకోవటంలేదు. వస్తాడు. తనను విడిచి ఎక్కడికీ వెళ్ళడు. వెళ్ళినా ఉండలేడు అని అంటుందే తప్ప వాస్తవాన్ని అంగీకరించటం లేదు. ఎలా ఒప్పుకుంటుంది? పెళ్ళయిన దగ్గరనుంచీ ఏనాడయినా విడిగా ఉన్నారా? వెళితే కలిసి వెళ్ళటం, కలిసి రావటం. అలా కుదరకపోతే ఏదో వంక చెప్పి ఫంక్షన్‌కి వెళ్ళటమే ఎగ్గొట్టెయ్యటం, 'అయ్యో!' అని బాధపడి విడిగా మనలేం అని నవ్వుకోవటం. ఎంత బాగుండేవా రోజులు!

ప్చ్! అవన్నీ మధుర స్మృతుల ఈనాడు తనకి. ఈ స్మృతుల తోటలో నడుస్తూ మిగిలిన జీవితాన్ని గడిపెయ్యగలదా? ఉహు. తన వల్లకాదు. అవి తీయటి జ్ఞాపకాల్లా ఇప్పుడు తనకనిపించటంలేదు. తిరిగిరాని వసంతాల్లా వెక్కిరిస్తున్నాయి. చిన్న మాటంటే తట్టుకోలేదని ఎవరెక్కడ ఏమాటంటారో అని నీడలా వెన్నంటి ఉండేవాడు. ఒకవేళ పొరపాటున ఎవరైనా ఏమైనా అంటే వినపడకుండా చెవులు మూసేస్తానని గుసగుసలాడేవాడు. ఆ గుసగుసలు ఇక లేవంటే ఎలా నమ్మటం?

ఆగని గాలి.. ఊగిపోతున్న చెట్లు.. అల్లాల్లాడుతున్న ఆకులు.. అవి కూడా 'మేమూ నమ్మం' అని చెబుతున్నట్లే అనిపించింది ఒక్క క్షణం.

"నీ ముఖం. నీకే కాదు కష్టాలు మాకూ ఉన్నాయి" అని చెబుతున్నాయి అర్థం చేసుకోవు అంటూ అంతరంగం.

నిజమే! తను ఎవరినీ అర్థం చేసుకోలేకపోతోందన్నది మాత్రం యధార్థం. లేకపోతే నిత్యం ఆ రాముని పూజించనిదే ఏమీ ముట్టని తనకి ఇంత శిక్ష వేస్తాడా? తన సన్నిధిలోనే ఈ బ్రతుకుకు సమాధి కడతాడా? ఆయనకేది ఇష్టమో తెలియక తనకిష్టమైన అన్నిటినీ ప్రసాదంగా సమర్పించేది. అందుకేనేమో... తను ఇవ్వకుండానే తనకత్యంత ప్రియమైన చందూను తీసుకెళ్ళిపోయాడు. ఇదెంతవరకూ న్యాయం? ప్రతివారూ తనలాగే ఆలోచిస్తే ఇక మరణాలు ఎందుకుంటాయి? అప్పుడు ప్రపంచం ఎలా ఉంటుంది? అదంతా తన కనవసరం. ఈ స్థితిని సమర్థించని స్థితిలో ఉంది తను. అంతే!

కాపురం మూణ్ణాల ముచ్చట అని అందరూ అను

కుంటున్నారు. నిజమే. చందూతో గడిపినవి మూడు వత్సరాలే. కానీ మూడు యుగాలకి సరిపడే అనుభూతినే పొందింది. అదే కదా తన బాధ. అనుభూతి లేని జీవితాన్ని గడపటం ఎలా? తన వల్ల కాదు.

అసలు ఆరజు అంత హడావిడిగా బయటికి వెళ్ళాడేం చందూ? మృత్యువు పిలిచిందనేనా? ఆత్రం పట్టలేక రోజూ తను రాసుకునే 'డైరీ' చదివాను. అందులో దానికి సంబంధించినదేమీ లేదు. కానీ బొట్టుబిళ్ళలు తేవడం మరిచానని తేవడానికి వెళ్ళాడన్నది తెలియని నిజం. శాశ్వతంగా కుంకుమ దిద్దుకునే అవకాశాన్ని తుడిచేశాడన్నది తెలిసిన సత్యం.

కిటికీలోంచి నైట్‌క్వీన్ నవ్వుతోంది. ఇన్నాళ్ళూ దానికా అవకాశమే రానిచ్చేవాడు కాదు చందూ! మా 'మధు' హాసం ముందు నువ్వెంత? నీ పరిమళం ఎంత అని పరిహసించేవాడు. తన నవ్వంటే అతనికి ప్రాణం. ఎప్పుడైనా కాస్త నలతగా ఉండి పెదాల మీద నవ్వు కనుమరుగైతే మా మధూ పెదాల మీద నిత్యం విరిసే నవ్వు పువ్వు ఈ రోజు ఎటు షికారు వెళ్ళిందబ్బా! తొందరగా వెళ్ళి తీసుకురావే పావురమా! అంటూ తన వెంటపడి నవ్వేవరకూ ఊరుకునే వాడు కాదు. మధూ 'చిరునవ్వు చెదరనీకు' అనేవాడు లాలనగా. ఇప్పుడు తనని అలా లాలించేవారెవరు? దుఃఖం గండి తెగిన ప్రవాహంలా ఊపేస్తోంది. దిండులో తలదూర్చి ఆపాలని ఎంత ప్రయత్నిస్తున్నా తరం కావటంలేదు. ఏడిస్తేనన్నా భారం తీరుతుందేమో? అసలు ఈ భారం దించేసుకోవాలని తనకు లేదు. ఇంకా ఇంకా పెంచేసుకొని గుండె పగిలి... నా చందూను చేరుకోగలిగితే... జరిగే పనా?

"అనుకున్నామని జరగవు అన్నీ.. అనుకోలేదని ఆగవు కొన్నీ.. జరిగేదంతా మంచికని అనుకోవటమే మనిషి పని. పాట బాగుంది కానీ జరిగేది ఏమిటి తనకు మంచి.. చందూ లేకుండా బ్రతకటం మంచా.. కాదు. చందూ లేని జీవితం ఎలాంటిదయినా తన కొద్దు. తనకొద్దు. అవును ఈ ఒంటరి జీవితానికి తానే ఎందుకు ముగింపు వాక్యం పలకకూడదూ?

పెట్రోల్ టాంక్ అదుపుతప్పి రామాలయాన్ని గుద్దుకోవటం ఏమిటి? ప్రక్కనుంచీ వస్తున్న నా చందూ ఆ మంటలో సజీవ దహనమవటమేమిటి? భగవంతుడివి నీవే లీలలు అని మురిసిపోతున్నావా? నీ రాతను చెరిపేస్తూ నా రాతను నేనే రాసుకుంటా అనుకుంటూ ఆవేశంగా వంటింట్లోకి చొరబడింది. వెతుకులాట ప్రారంభించింది. ఆ మధ్య మామయ్య గారు పురుగుల మందు కావాలంటే 'నవక్రాన్' కొని ఉంచాడు చందు. రైతుబిడ్డ ననిపించుకున్నాడు. తనకిలా అది సహాయ పడుతుందని అనుకుందా? అది వాళ్ళకి అందించకుండానే వెళ్ళిపోయాడు. ఏదీ? ఎక్కడా కనిపించదే!

"ఆగు! అంత తొందర పనికిరాదు. కష్టమొచ్చిన ప్రతి వాళ్ళూ ఇలాగ తమకు తాము గొప్పవాళ్ళమనుకొని ఆత్మహత్య చేసుకుంటే ఈ లోకంలో ఎవరూ ఉండరు" అంతరాత్మ ఎంత అడ్డుకోవాలని ప్రయత్నించినా

'నేను నీ మాటలు వినే పరిస్థితుల్లో లేను. ఇక నీకూ నాకూ అనుబంధం కొన్ని క్షణాలే. గుడ్‌బై. నన్ను విడిచిపెట్టెయ్!" అంది తన అన్వేషణ ఆపకుండానే!

అలమారాలో వెనుకవైపు పడి ఉంది. నిధి దొరికినంత ఆనందమయింది. ఎంత ప్రయత్నించినా మూత రావటంలేదు. శబ్దమయితే అందరూ లేస్తారు. మూత తియ్యటానికి అందుబాటులో ఏమీ లేదే? అనుకొంది. మరుక్షణంలో ఇలాంటివన్నీ గాజు గ్లాసులో వేసి గ్యాసు పొయ్యి ప్రక్కన పెడతానుగా అని గుర్తు వచ్చింది. చందూ చనిపోయాడని తెలిసిన దగ్గర్నుంచి తను తనుగా లేదు. ఏమీ గుర్తు రావటంలేదు. ఒక్క చందూ... చందూ ఆలోచనలు తప్ప. ఆలోచిస్తూనే డబ్బా మూత తీసింది. మరో ఆలోచనకి తావివ్వకుండా తాగెయ్యాలని తాపత్రయపడుతూ నోటి దగ్గరకు తీసుకు వచ్చింది. ఇక చుక్క గొంతులోకి జారటమే తరువాయి. ఇంతలో చీర కుచ్చెళ్ళు లాగినట్లు కాలి మీద మెత్తని సవ్వడి. ఎవరు ఇప్పుడు తనను కలత చెందించే సాహసం చేసింది? వద్దనుకుంటూనే కళ్ళను అటువైపు సారించింది. ఆశ్చర్యం. తన చిన్ని 'కార్తీక్'.

## ఉత్సవ్!

**తో**రణ తోరణాలుగా
ఉత్సవాలుండగా
మళ్ళీ వూరకే మరో
ఉత్సవాలెందుకు?
లక్షల్లో దండగ తప్ప!
పేదోడు బ్రతికే మార్గమే
నిజమైన ఉత్సవం
ఉన్నతోత్సవం!

–గుడిమెట్ల గోపాలకృష్ణ

నీలాకాశంలో వెన్నెల చంద్రుడులా వెలిగిపోతున్న తమ దాంపత్యపు తొలి పంట. నీలిరంగు బెడ్ బల్బ్ కాంతిలో కూడా మెరిసిపోతున్నాడు. అప్రయత్నంగా చేతిలోని డబ్బాను క్రింద పెట్టేసాను. ఆశగా తనవైపే చూస్తున్న వాడిని ఎత్తుకొని ముద్దుల్లో ముంచెత్తాను.

"వాడు అచ్చు నా పోలికేనోయ్! చూడు ఆ ముక్కు ముఖం, కళ్ళు, పెదాలు.. ఏవీ తేడాలేదు. పెద్దయ్యాక డబల్ రోల్ వేసి నిన్నేడిపించవచ్చు" చందూ మాటలు చెవుల్లో మారుమ్రోగుతున్నాయి.

అరె, తన ప్రతిబింబాన్ని చెంత పెట్టుకొని, అసలు వాడి ధ్యాసే లేనట్లు ఎంత పిచ్చిగా బ్రతుకును అంతం చేసుకోబోయింది. చందూ మీద తనకున్న ప్రేమ కన్నబిడ్డనే మరిచిపోయేట్లు చేసిందేం? ఈ లోకంలో తనలాంటి తల్లులు ఉంటారా? ఉండరేమో! లేకపోతే క్షణం ఆగితే తండ్రీ, తల్లీ లేని అనాథయిపోయేవాడు. చనిపోయిన చందూతో పాటూ తనూ వెళ్ళిపోతే వాడు ఏమైపోతాడు? వాడెలాపోతే తనకేం అని వెళ్ళిపో గలదా?

ఈ నిముషాన కూడా చందూ వైపు ఆలోచిస్తే వెళ్ళిపోదామనే! 'కార్తీక్'ని చూశాక కన్న తల్లి పేగు పాశంలా మరోవైపు బలవంతంగా లాక్కెళ్ళిపోతోంది. నిన్నటి నుంచీ ఏమీ తినలేదేమో తూలిపడబోయింది. ప్రక్కనే ఉన్న ఫ్రిజ్‌ని ఆసరాగా పట్టుకొంది. ఆ పట్టుకోవ టంలో కార్తీక్ చెయ్యి వెళ్ళి ఫోటో ఫ్రేమ్‌కి తగిలింది. క్రింద పడుతుందేమోనని గబుక్కున చెయ్యి అడ్డు పెట్టింది.

పడంలే అన్నట్లు నవ్వుతూ అమ్మా నాన్న, అన్నయ్య, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు ఫోటోలోంచి. అది తమ ఫ్యామిలీ ఫోటో. వాళ్ళ నవ్వులు చూస్తుంటే తనను తనే తిట్టుకోవాలనిపిస్తోంది. లేకపోతే ప్రతి రూమ్ లోనూ ఈ ఫ్యామిలీ ఫొటో పెట్టానని 'చందూ' సరదాగా నవ్వేవాడు.

"నవ్వితే నవ్వావోయ్! వాళ్ళందరినీ వదిలి నీకోసం రావటమే గ్రేట్! అలా ఏ రూమ్‌లోకి వెళ్ళినా వాళ్ళు నాకు కనిపించాలి. అప్పుడే నా వాళ్ళు నాతోనే ఉన్నట్లు అనిపిస్తుంది" అంటూ అతని గుండెల్లో ఒదిగిపోయేది.

"ఊరికే అన్నానురా! ఈ విషయంలో నీకే సపోర్ట్. ఇలా అమ్మా నాన్నల్ని, అందరినీ వదిలెయ్యాలనే ఆడపిల్లగా మాత్రం పుట్టకూడదనుకుంటాను. నువ్వు మరో పాపను కనిచ్చెయ్. దాన్ని అత్తవారింటికి పంప కుండా అల్లుడ్నే మన దగ్గరికి తెచ్చేసుకుందాం" అంటూ మరిపించేవాడు.

ఫోటోలో వాళ్ళంతా నవ్వటం మానేసి "మమ్మ ల్నంతా మరిచిపోయి ఎలా వెళ్ళిపోదామనుకున్నావ్?" అంటూ ఒక్కొక్కరూ తమ బాధనంతా వాళ్ళ కళ్ళలో చూపిస్తూ తన మీదకు దండయాత్రకు వస్తున్నారు. ఒక్క క్షణం భయం వేసింది.

నిజమే కదా! చందూ చనిపోయాడనే కుమిలిపోతు న్నారు. తను కూడా వెళ్ళిపోతే తట్టుకోగలిగేవారా? చందూ, తనూ కార్తీక్‌ని ప్రాణానికి ప్రాణంగా చూసు కొనేవాళ్ళు. సంవత్సరం కూడా నిండని వాడిమీదే తమకింత మమకారమయితే ఇరవై సంవత్సరాలు అల్లారు ముద్దుగా పెంచిన తల్లితండ్రులకి తన మీద ఇంకెంత ప్రేమ ఉంటుందో? అనాలోచితంగా తను ఆత్మహత్యకు పాల్పడి ఉంటే వాళ్ళకెంత కడుపుకోత? అసలు తను అలా ఆలోచించలేదే? ఎందుకని? ఏమో అనుకోలేకపోయింది– చందూ లేకుండా బ్రతకట మంటే ప్రాణమున్న శవంలా బ్రతకటమే! అది తన ఒక్కర్తికే తెలుసు. కానీ.. వాళ్ళందరి ప్రేమ ముందు తను తలవంచక తప్పదు.

'పిచ్చిపిల్ల! మోడులా ఒక్క ఆకు లేని నైట్‌క్వీన్ కూడా శిశిరం రాగానే చిగురువేస్తుంది. పువ్వులతో కళకళలాడుతుంది విచిత్రంగా. బాధలలో ఆలోచనల లానే ఉంటాయి. కాలం ఎలాంటి గాయాన్నయినా మాన్పుతుంది. కొన్నాళ్ళు మచ్చ మిగులుతుంది. మరి కొన్నాళ్ళకు మచ్చ కూడా మాయమవుతుంది' అను కొంది ఆమె అంతరంగం మనసులోనే జాలిపడుతూ. అదేమీ తనకు పట్టనట్లు, తెలియనట్లు తన ఆలోచన లలో తను ఉంది మధు.

## మౌన సంకేతాలు!

**నా** గుండెల్ని త్రవ్వుతున్నపుడు
నీకు కరెన్సీ మాత్రమే దొరికిందా
ప్రేమ తేనెలు రాలలేదా?
నా మనసు పిండుతున్నపుడు
నీకు ఆకర్షణలే కన్పించేయా
అనురాగ శబ్దాలు వినబడలేదా?
బహుశా నువ్వు శిల్పానివి కూడా కాదు
కనీసం మౌన సంకేతాల్ని వెదజల్లేది!

**–జి.జి.కె. రావు**

తన కోసం కాదు... తన కుటుంబం కోసం.. కార్తీక్ కోసం.. అలా అనుకుంటో తప్ప తను బ్రతక లేదు. తను కాలిపోతున్నా, కరిగిపోతున్నా దీపం వెలుగునివ్వాలనే చూస్తుంది చివరి క్షణం వరకూ. అలాగే తను కూడ మనసు కాలిపోతున్నా వెన్నంటి మృదుత్వాన్ని పూతగా పూసి వెన్నెలంటి నవ్వును పెదాల మీద పూయించాలి. ఆ నవ్వే వాళ్ళందరి హృదయాల్లో కదలాడే భయాన్ని కడిగెయ్యాలి అనుకొని డబ్బా మీద మూత పెట్టబోయింది.

ఇంతలో 'మధూ! మధూ!' అని నిద్రలో తల్లి కలవ రించటం వినిపించి పరుగులాంటి నడకతో ఆమెను చేరి ప్రక్కలో పడుకొని ఆమె చేతిని తన మీద వేసుకొని 'ఇక్కడే ఉన్నానమ్మా!' అంది.

"ఊఁ!" అంటూ వత్తిగిలి పడుకుందావిడ.

కార్తీక్‌ని తన దగ్గరిగా లాక్కుంది. జోకొడుతుంటే రెండు నిముషాలు కాకుండానే నిద్రలోకి జారు కున్నాడు. తన ప్రయత్నం ఆపటానికే వాడు లేచాడేమో!

హాలంతా తెల్లని బెడ్ బల్బు కాంతిలో పరుచుకొని ఉంది. వరుసగా తన కుటుంబ సభ్యులంతా పడుకొని ఉన్నారు. దేశం నలుమూలల్లో ఉన్న వాళ్ళంతా పక్షుల్లా రెక్కలు కట్టుకొని వాలారు. వాళ్ళందరి ముఖాల్లో దైన్యం తాండవిస్తోంది. ఆందోళన, కలత చెందిన మనసు, వ్యధ ప్రస్ఫుటంగా గోచరిస్తోంది. అసహనంగా కదులు తున్నారు– నాన్నగారిలో తొంగిచూస్తున్న వృద్ధాప్యం.

ఆయన వయసుకి కాస్త తక్కువగానే కనిపిస్తారు. ఇలా తయారవడానికి కారణం తన గురించిన దిగులే!

అమ్మ నిద్రపోతున్నా ఆమె చేతులు తనను జోకొడు తున్నాయి. తల్లడిల్లిపోయి ఉంటుంది.

చందూ చనిపోయాడన్న వార్త తన చుట్టూ చీకటి మేఘాలను సృష్టించింది. ఏం జరుగుతుందో తనకే తెలియని పరిస్థితులలో తనను తనే మరిచి చందు ఆలోచనలలో లీనమవ్వటం ఒక్కటే తనకు తెలుసు.

ఇప్పుడు కదా ఈ లోకంలోకి వచ్చింది. నిద్రాదేవి కనురెప్పల ఛాయలకే రానని దూర దూరంగా సాగి పోయింది. తన గురించి తప్ప అందరి గురించి ఆలోచి స్తూనే గడిపేసింది. తెలతెలవారుతుండగా నిద్రాదేవి జాలితలచి ఆమెను ఆవహించింది. ఆలోచనల వేడిని కరిగించి లాలించే తల్లి ఒడిలా ఆమెను తనలోకి లాక్కుంది. పసిపాపలా ముడుచుకొని ఆమెలో ఒదిగి పోయింది.

❖ ❖ ❖

అప్పుడే కళ్ళు తెరిచిన 'శారదాంబ' అరచేయిని చూసుకొని దైవనమస్కారం చేసుకొని కూతురి వైపు తిరిగింది. ఆమెను చూసి వేడి నిట్టూర్పు విడిచింది.

వేటగాని దెబ్బకు రాలిపోయిన పక్షిని చూసి జంట పక్షి విలవిలలాడే దృశ్యం ఆమె నిద్రపోతున్న తీరులో కనిపించి హృదయం మెలిత్రిప్పినట్లయింది. ఎంత దగ్గరవారు పోయినా వండుకోవటం, తినటం తప్పదు కదా అనుకుంటూ నిరాశక్తంగా అడుగులు ముందుకు వేసి పెరట్లోకి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చి బొట్టు పెట్టుకుంటుంటే మళ్ళీ బొట్టులేని కూతురి ముఖం తన ముఖానికి బదులు అద్దంలో కనిపించింది. అను క్షణం చిత్రహింస. ఈ వయసులో ఇంత బాధ రాసా వేమిటి భగవంతుడా అనుకొంది. గుండెల మీద ఎవరో ధనధనా పరుగెడుతున్నంత బాధ. అలాగే వెళ్ళి గుమ్మం బయట గూట్లో ఉంచిన పాలపేకట్లు తీసుకొని వంటిం ట్లోకి వెళ్ళింది. వీటిని కత్తిరించి గిన్నెలో పోసి పొయ్యి మీద పెట్టేప్పుడు చూసిందావిడ తెరిచి ఉంచిన పురు గుల మందు డబ్బాని. ఒక్క క్షణం గుండె ఆగిపోయిం దేమో అన్న అనుమానం. తర్వాత దానికి రెట్టింపు వేగంతో కొట్టుకోసాగింది.

ఇది 'మధూ' పనా? అప్పటికీ రాత్రిళ్ళు నిద్ర పోకుండా కాచుకునే కూర్చున్నారందరూ! చిన్నోడు చూస్తానన్నాడే? ఎప్పుడు కునుకు పట్టింది? ఎంత ఘోరం తప్పింది? ఆమెలో అంతులోని ఆందోళన. ఏదో అదృష్టం తమని కాపాడింది. లేకపోతే మరో ఘోరం ఈ ఇంట. ఇక ఏ కష్టాన్నీ ఈ ముసలి గుండె తట్టుకోలేదు. తీరం చేరేప్పుడు ప్రతి అల ఇలాగే అను కుంటుంది. గబగబా ప్రక్కనే ఉన్న డబ్బా మూతను పెట్టి దాన్ని తీసుకెళ్ళి రోడ్డు మీద చెత్త కుండీలో పడేసి వచ్చింది. అప్పటికి గానీ ఆవిడలో గుండె దడ తగ్గలేదు. మనసు కాస్త స్థిమితం చేసుకోవటానికి అక్కడే అరుగు మీద కూర్చుండి పోయింది. నెమ్మదిగా పిల్లలందరూ ప్రక్కన చేరారు తల్లినలా చూసి కంగారు పడుతూ. విషయం తెలుసుకున్న అందరూ విస్తుపోయారు.

అందరూ మధూ చుట్టూ చేరారు. అప్పుడే కళ్ళు తెరిచిన మధూ పెదాలపైన చిరునవ్వు.

తనవారంతా తన చుట్టూ. ఆమె నవ్వు చూసి వారంతా తెప్పరిల్లారు.

ఈమె చిరునవ్వు ముందు ఎన్ని దీపావళి వెలుగు లైనా బలాదూరేనని తన సృష్టికి తనే విస్తుపోయాడా బ్రహ్మ. ■